విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శుక్రవారం 21 మార్చి 2025 8 పేజీలు

మత్తుపదార్థాల నివారణే లక్ష్యం

- ప్రతి విద్యాసంస్థలో ఈగిల్ క్లబ్బుల ఏర్పాటు
- డ్రగ్స్ నివారణకు టోల్ ఫ్రీ1972 ఏర్పాటు
- కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : మత్తు పదార్థాల నివారణే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గురువారం ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సమావేశంలో ఎస్పీ కెపిఎస్. కిషోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారి కె. రత్నప్రసాద్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు. డ్రగ్స్ నివారణ, సహాయం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 విస్తృత ప్రచారానికి సంబంధించి ప్రచురించిన స్టిక్కర్లను, కరపత్రాలను, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి నిర్మూలనకు వచ్చే విద్యా సంవత్సరం నాటికి యాంటీనార్కోటిక్ టాస్క్ ఫోర్స్ (ఈగిల్ క్లబ్బులు) అన్ని విద్యా సంస్థల్లో ఏర్పాటు చేయాలన్నారు డివిజన్, మండల స్థాయిలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను సంబంధిత ఆర్డిఓ, తహశీల్దార్లు సమాచారం అందించాలన్నారు. జిల్లా ఎస్పీ కె.పి.ఎస్. కిషోర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసే ఈగిల్ క్లబ్బుల అన్నింటికి కలిపి వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠ శాలకు సమీపంలో ఉండే బడ్డీల్లో సిగ రెట్లు, తదితరాల అమ్మకాలను గుర్తిం చిన, మద్యం సేవించి పబ్లిక్ ప్రదేశాల్లో ప్రజా భద్రతకు భంగం కలిగిస్తే వెంటనే సమాచారం అందించా లన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లాలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై విద్యా సంస్థలతో పాటు పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాదకద్రవ్య దుర్వినియోగ బాధితులకు చట్టపరమైన సేవలు, మాదక ద్రవ్య ముప్పు నిర్మూలనకు సంబంధించి త్వరలో మూసా యిదా వెలువడనున్నదని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు బి.శ్రీలత, డిఎఫ్ఓ శుభమ్, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు కెవిఎన్.ప్రభు కుమార్, జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారి ఎ. ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్... జీవితం అయోమయం

- ఉచ్చులో చిక్కుతున్న యువత
- అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: మరో రెండు రోజులలో ఐపీఎల్ పోరు మొదలుకానున్నది. రెండు నెలలకు పైగా సాగే ఈ సంగ్రామాన్ని కొందరు వినోదం కోసం చూస్తుండగా.. మరికొందరు సులభంగా ఆదాయం సంపాదించే వనరుగా భావిస్తున్నారు. బంతి బంతికి బెట్టింగ్ పెట్టి డబ్బు సంపాదించాలని అత్యాశపడుతున్నారు. ఈ ఊబిలో చిక్కుకొని అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా యువతే ఇందులో బాధితులుగా మారుతున్నారు. ఆఫ్‌లైన్ తో పాటు ఆన్ లైన్ మార్గంలోనూ సాగుతున్న బెట్టింగ్ లపై దృష్టి సారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.బెట్టింగుల సంస్కృతి గతంలో నగరాలలోనే కనిపించేది.క్రమేణా పట్టణాలు, మండల కేంద్రాలకు పాకింది.ఇప్పుడు పల్లె పల్లెకు విస్తరించింది. కొన్నేళ్ల కిందట అందరూ ఓ చోట కూర్చుని పందేలు కాసేవారు.ఆ తర్వాత కాలంలో పెద్ద మొత్తాలలో బెట్టింగ్ లు జరిగేటప్పుడు బుకీల పేర్లు వినిపించేవి. ప్రస్తుతం చాలావరకు ఆన్ లైన్ లోనే ఐపిఎల్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. పలు యాప్ లలో పందేలు కాస్తూ ఈ విష వలయంలో చిక్కుకుంటున్నారు.

రెండు నెలల్లో రూ.80 కోట్లు

ఐపీఎల్ సాగే ఈ రెండు నెలలలో ఉమ్మడి జిల్లాలో ప్రధాన పట్టణాలలో రూ.80 కోట్ల వరకు చేతులు మారుతాయని గతంలోని పోలీసు శాఖ అంచనా వేసింది. ప్రధానంగా యువత రెండు జిల్లాలలో కలిపి రూ.60 కోట్లు బెట్టింగ్ లో పెడుతున్నారు. వీరితో పాటుగా ▶మిగతా 2లో..

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రాజకీయ పార్టీల ప్రతినిధు లను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎన్నికల అధికారులతో కలిసి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ ▶మిగతా 2లో..

ఆటో కార్మికుల ఉపాధిపై ముప్పేట దాడి

విశాలాంధ్ర - అమలాపురం : ఆటో కార్మికుల ఉపాధి పై ముప్పేట దాడి జరుగుతోందని ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు అన్నారు. ఆంధ్ర ఆటోవాలా యూనియన్ అమలా పురం రూరల్ మండల జనరల్ బాడీ సమావేశం ఆంధ్ర ఆటో వాలా యూనియన్ జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన నడిపూడి కెనాల్ రోడ్డులోని దుర్గా ఆంజనేయం ఆటో యూనిట్ యూనియన్ కార్యాల యంలో గురువారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్తిబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2014 రోడ్డు ట్రాన్స్‌పోర్టు యాక్టు అమల్లో విపరీతమైన పెనాల్టీలు, కఠిన శిక్షలు, వాహనం బ్రేక్ చేయించుకోవడానికి మార్గదర్శకాలు రీత్యా వాహన యాజమాన్యం పై ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇప్పటికే ఆటోవాలా ఆదాయం పడిపోయిందన్నారు.

ఉపాధిరంగం, అసంఘటిత కార్మికులు ఆర్థికంగా తీవ్రంగా ▶మిగతా 2లో..

విద్యుత్ మీటర్ రీడర్లకు న్యాయం చేయాలి

విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్స్ పేరుతో విద్యుత్ మీటర్ రీడర్లను రోడ్డున పడేయవద్దని, ఏ రాష్ట్రంలో లేని స్మార్ట్ మీటర్లు మనపై రుద్దడం దారుణమని, మీటర్ రీడర్స్ పొట్టలు కొట్టొద్దని, వారికి సంస్థలోనే ప్రత్యా మ్నాయం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం చినరంగని పాలెం యూనియన్ బ్యాంకు నుంచి విద్యుత్ ఎస్ఇ కార్యాలయం వరకు ప్రదర్శన, విద్యుత్ కార్యా లయం వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రంను విద్యుత్ ఎస్.ఇ.ఆలపాటి రఘునాథ్‌బాబు, డి. ఇ.నరహరశెట్టి వెంకటేశ్వరరావుకు సమర్పించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి ఇది ప్రజా ప్రయోజనాలకు అరిష్టమని పెద బొబ్బలు పెట్టిన నారా లోకేష్ ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ భీమవరం డివిజన్ ▶మిగతా 2లో..

ప్లాస్టిక్ రీ సైక్లింగ్ పరిశ్రమలు స్థాపించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కలల సాకారంలో భాగంగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికవేత్తలు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడనాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన

జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ▶మిగతా 2లో..

సీఎం ఆదేశాలతో ఏసమ్మకు ప్రభుత్వ సాయం

విశాలాంధ్ర -భీమవరం: ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఒక లక్ష రూపాయల చెక్ ను దువ్వ గ్రామానికి చెందిన నందివాడ ఏసమ్మకు కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం తన ఛాంబర్లో అందచేశారు. తణుకులో మార్చి 15న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును సభ అనంతరం నందివాడ ఏసమ్మ ఆమె కుమారుడుతో కలిసి వికలాంగులాంగుడైన తన కొడుకు వాస్తవ పరిస్థితిని చూపిస్తూ సాయమర్ధించిన సంగతి విదితమే. ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ను ఆదేశిస్తూ ఒక లక్ష రూపాయలు వారి బిడ్డ పేరున డిపాజిట్ చేసేందుకు సీఎంఆర్ఎఫ్ నిధులు నుండి మంజూరు చేయాలని ఆదేశించడం, ఏసమ్మ ఏ విధమైన దరఖాస్తు అంద చేయకపోవడంతో ఆమె వివరాలు ఏమీ లేక, ఆమె ఫోటో ఆధారంగా ఆచూకీ తెలుసుకోవడానికి పోలీస్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది రెండు రోజులు చుట్టుపక్కల గ్రామాలన్నీ జల్లెడ పట్టి ఎట్టకేలకు సదరు మహిళ ఆచూకీ కనుగొని ఆమెకు, ఆమె బిడ్డకు సహాయకంగా వీఆర్ఏను జత చేసి భీమవరం కలెక్టరేట్ కు తీసుకొచ్చి ఒక లక్ష రూపాయల చెక్కును గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందజేసారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, తాడేపల్లిగూడెం ఆర్డీవో కతీబ్ కౌసర్ భానో, తణుకు తహసిల్దార్ డివివిఎస్ అశోక్ వర్మ, వీఆర్ఏ ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-టి నరసాపురం: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయురాలు భూక్యా నాగమణి తెలిపారు. టి నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం పంచముఖ హనుమాన్ దేవాలయం సెంటర్లో బంజారా భజరంగీ భేరీ , భూక్యా గోపయ్య సక్కమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రంను బోడ దృత్విక్ నాయక్ గురువారం ప్రారంభించారు. మొదటి రోజు బాటసారులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూక్యా నాగమణి మాట్లాడుతూ వేసవికాలంలో వడ దెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణు గోపాల్ , భూక్యా భిగ్నాన్ధం, తేజావత్ వెంకన్న, భూక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థాపించాలి (1వ పేజీ తరువాయి)

స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమని స్పష్టం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కలల సాకారంలో భాగంగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. వివిధ పరిశ్రమల స్థాపనకు అందిన ధరఖాస్తులను అన్ని శాఖలు నిర్ణీత గడువులోపుగా అనుమతులను మంజూరు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాల న్నారు. పిఎంఈజీపి పథకం కోసం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక మండలాల వారీగా నివేదికల సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పవర్ కాస్ట్ రియంబర్స్మెంట్ కింద మూడు రాయితీలను, ఇంట్రెస్ట్ సబ్సిడీ కింద మూడు రాయితీ లను కలిపి మొత్తం ఆరు రాయితీల మంజూరుకు ఆమోదించారు. సమా వేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా పంచా యత్ అధికారి బి.అరుణ శ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్.వి. ఎస్.వి ప్రసాద్, ఏపీఐఎఫ్ సిసిఐ మేనేజింగ్ కమిటీ సభ్యులు కె.సత్య నారాయణ రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీని వాసరావు తది తరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **DATLA SOUJANYA (new name) W/o. R V PRASADA RAJU M,** previously called **SOUJANYA MANTHINA (old name)** resident of D.No 6-243, DanthuluriVari Street, Kotha peta, Chinaamiram Village, Bhimavaram Mandal, West Godavari district, AP-534204, Do hereby declare that I have changed my name from **SOUJANYA MANTHINA** old name to **DATLA SOUJANYA (new name)** for future all purposes.

దాడి (1వ పేజీ తరువాయి)

నష్టపోతున్నారని అన్నారు. పలువురు ఆటో కార్మికులు మాట్లాడుతూ గత 20సంవత్సరా లుగా పంచాయతీల్లో, మున్సిపాలిటీలో, జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆటో నిలుపుకునేందుకు చట్టబద్ధమైన ఆటో స్టాండ్లు నెలకొల్పలేదన్నారు. గ్రామ, మండల, పట్టణ ప్రాంతాల్లో ఆటోస్టాండ్లు ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు దీర్ఘకాలిక లక్ష్యాలుగా మిగిలిపోయా యని వాపోయారు. ఆంధ్ర ఆటోవాలా యూనియన్ మండల, డివిజన్, జిల్లా కమిటీలు నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని ప్రభుత్వం ముందుకు తీసుకు పోవాలని పిలుపునిచ్చారు. స్తబ్దతలో ఉన్న రవాణా జేఏసీని పునర్ వ్యవస్థీకరణ చేసి రవాణా వాహన దారుల సమస్యలు పై స్థానిక ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకు పోయి వివరించి వారి సహకారంతో ప్రభుత్వానికి నివేదిక అందించాలని విజ్ఞప్తి చేశారు. సత్తిరాజు అధ్యక్షోపన్యాసంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై ఆందోళనలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్ సమావేశం ఎజెండాను చదివి వినిపించి ఆమోదానికి పెట్టారు. సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొలిశెట్టి గౌరీ శంకర్, ఆంధ్ర ఆటో వాలా జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లి వెంకటేశ్వరరావు, వాసం శెట్టి శ్రీనివాసరావు, బొక్కా మంగరాజు, రామిరెడ్డి చంద్రరావులు హాజరై వేదికపై ఆశీనులు అయ్యారు. అనంతరం అమలాపురం రూరల్ మండల నూతన కమిటీ 11 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా గుత్తుల రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా బాషా రామకృష్ణ ఎన్నికయ్యారు.

సహకరించాలి (1వ పేజీ తరువాయి)

కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వారిగా ఎలక్ట్రోరోల్ సంఖ్య, నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచ నలు, సలహాలుబీ బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు నియామకం, శిక్షణ కార్యక్రమాలు, పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ, ఆధార్ నెంబర్కు ఎలక్ట్రోరల్ అనుసంధానం చేయడం వంటి అంశాలను ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అవసరమైన సూచనలు, సలహాలు తీసు కుంటుందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ప్రతినిధులు తప్పులు లేని ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల తరలింపు, నూతన పోలింగ్ కేంద్రాల ప్రతిపాదన, పోలింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, 18-19 వయసుగల యువత ఓటు నమోదు వంటి అంశాలపై తమ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 1640 పోలింగ్ కేంద్రాల్లో 16,లక్షల 36,916 మంది ఓటర్ల ఉన్నారన్నారు. ఇందులో 1000-1200 మంది ఓటర్లు 586 పోలింగ్ కేంద్రాల్లోనూ, 1200పైన ఓటర్లు 279 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ఆయన తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 800-1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించనున్నా మన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారి ఎం జగన్నాథం, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి. సాయిబాబా (తెదేపా), ఎస్ అప్పారావు (బీఎస్పీ), బి. జయప్రకాష్ (కాంగ్రెస్), కె. కృష్ణమోహన్(ఆప్), ఆర్. వెంకటేశ్వరరావు (వైఎస్సార్సీపీ), సీహెచ్ రమేష్ బాబు(భాజపా), టి. ఈశ్వరరావు(సీపీఎం), ఎ.సత్యనారాయణ (జనసేన) ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి (1వ పేజీ తరువాయి)

అధ్యక్షులు పెనుమాక జాకబ్ మాట్లాడుతూ ఎస్క్రో అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని గతంలో సంస్థ సిఎండి మీటర్ రీడర్స్ కు మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, మీటర్ రీడర్స్ కు ఎస్క్రో ద్వారా వేతనాలు ఇవ్వని కాంట్రాక్టరును బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, విద్యుత్ మీటర్ రీడర్స్ డివిజన్ అధ్యక్షుడు పి.జాకబ్, జిల్లా ఉపాధ్యక్షుడు వి. శ్రీనివాసరావు, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, బాలాజీ, నరశింహ, అఖిల్ రాజు, వంశీ, సుధాకర్, సూర్య, శ్రీనివాస్, చక్రధర్, వెంకట్రావు రఘునాధరావు, నర్సింగం, శ్రీనివాసరావు, చింతయ్య, ఆదారి నర్సింహమూర్తి, కె.బాలాజీ, రఘురామ్ తదితరులు ధర్నాకు నాయకత్వం వహించారు.

అయోమయం(1వ పేజీ తరువాయి)

ఇతర పందెం రాయుళ్లు కూడా బెట్టింగ్లకు పాల్పడుతున్నారు. మ్యాచ్ ముగిసిన క్షణాల వ్యవధిలోనే వివిధ యాప్ ల ద్వారా నగదు బదిలీ అవుతున్నదున మంచినీళ్లప్రాయంగా పందేలు కాస్తున్నారు.ప్రధానంగా ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసా పురం తదితర ప్రాంతాలలో ఎక్కువ మంది యువత ఈ బెట్టింగ్ల ఉచ్చులో పడుతున్నారు.

ఆస్తులు, బంగారం, బైకులు అమ్మి...

ఒక్కసారి బెట్టింగ్ వ్యసనానికి బానిసైన వ్యక్తులు బయటపడటం అసాధ్యమవుతోంది. చివరకు ఇల్లు,స్థలాలు, పొలాలు,తాకట్టు పెడుతున్నారు. అయినా రుణాలు తీర్చలేని పక్షంలో ఆస్తులు అన్ని బికారులవుతున్నారు. యువత కార్లు,బైకులు, బంగారం అమ్ముకుంటు న్నారు. బెట్టింగ్ పేరుతో సర్వస్వం కోల్పోతున్నారు. సీజన్ ముగిసే సరికి వెనక్కు తిరిగి చూసుకుంటే రూ.లక్షలు, కోట్లు అప్పులు కనిపిస్తున్నాయి. వీటిని కట్టలేక, అప్పులు ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక విధి లేని పరిస్థితులలో బలవంతంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

నిందితులపై ఓ కన్నేస్తే...

గతంలో బెట్టింగ్ కేసులలో అరెస్ట్ అయిన నిందితులపై పోలీసులు ఓ కన్నేస్తే కొంత వరకైనా వీటికి అడ్డు కట్టపడుతుంది. మధ్యవర్తు లుగా వ్యవహరించే బుకీల కార్యకలాపాల పైన దృష్టి సారించాలి.లోతుగా విచారిస్తే సూత్ర ధారులే స్పష్టంగా తెలుస్తుంది. అవసరమైన పక్షంలో యాప్ నిర్వాహకుల పైన కేసులు నమోదు చేయాలి.ఇతర రాష్ట్రాలలో పోలీసులు ఈ వ్యవహారంపై ఉక్కు పాదం మోపుతున్నారు. బెట్టింగ్ లను ప్రోత్సహిస్తున్న సామాజిక మాధ్యమాలలో ప్రభావితం చేసే వారి పైన చర్యలు తీసుకోవాలి. ఇదేవిధంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనూ కఠినంగా వ్యవహరించాలి.

విచిత్ర వాతావరణం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: పగలు ఎండ తీవ్రత, రాత్రి చలితో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గురువారం ఉదయం 7:30 గంటలకే సూర్య భగవానుడు తన విశ్వరూపాన్ని చూపించడం ఆరంభించాడు. మధ్యాహ్నం మూడు గంటలు అయినప్పటికీ 36 డిగ్రీల నుంచి 38 డిగ్రీల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పగలు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతుంటే, రాత్రి వేళల్లో మంచుతో కూడిన చలి ఎక్కువగా ఉంటుందని వింత వాతావరణంతో రోజులు గడుస్తున్నాయని, వేసవికాలం పూర్తిగా రాకమునుపే ఎండ అధికంగా ఉంటున్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

భూ వివాదాల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర-లింగపాలెం: నూజివీడు రెవెన్యూ సబ్ డివిజన్ సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ లింగపాలెం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. అధికారులకు వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ ఫిర్యాదు దారులతో మాట్లాడారు. ఫిర్యాదుదారుల వినతులు విన్న సబ్ కలెక్టర్ వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.భూముల వివాదాలకు సంబంధించి పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు, మండల సర్వేయర్ ప్రేమ కుమార్,గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రెవిన్యూ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-లింగపాలెం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తహసిల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వాణి తెలిపారు.మండల కేంద్రమైన లింగపాలెం లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాలకు అనుగుణంగా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వీరు తెలిపారు. లింగపాలెంలోని చలివేంద్రప్రారంభ సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను తహసిల్దార్,ఎంపీడీవో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు, రెవిన్యూ అధికారి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర- ఉండి : ఆక్వా రైతులను అన్ని విధాల ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఉండి మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతు సంఘం మండల కమిటీ సమావేశం సంఘ ఉపాధ్యక్షులు జీను ఆదినారాయణ అధ్యక్షతన గురువారం రైతు సంఘం కార్యాలయంలో జరిగింది. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుయుక్తులు పన్నుతున్నాయని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఎద్దేవ చేశారు. సంఘ ఉపాధ్యక్షులు జీను ఆదినారాయణ మాట్లాడుతూ రొయ్యల ధరలు రోజురోజుకు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్డ్ స్టోరేజ్ లు లేని కారణంగా ఆక్వా రైతులు రొయ్యలను అయిన కాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. నాణ్యతలేని మేత, సీడు కారణంగా ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదాసి గోపి మాట్లాడుతూ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని చిన్నచూపు చూడటం తగదన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కిలారి తవిటి నాయుడు, నక్క వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీపై సర్పంచ్ డీజీపీకి ఫిర్యాదు

అన్యాయం జరిగింది.. న్యాయం చేయాలంటూ సర్పంచ్ వేడుకోలు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం జెడ్పీటీసీ హరినాథరాజ్ పై ఇదే మండలం ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్ డిజిపి హరీష్ కుమార్ గుప్తాకి స్వయంగా ఫిర్యాదు చేయటం సర్వత్రా చర్చనీ యాంశం అయ్యింది. ఒంగోలులో భూములు ఇప్పిస్తానంటూ తన వద్ద నుంచి రెండు విడతలుగా రూ1.10 కోటి తీసుకొని భూములు ఇవ్వలేదని,తిరిగి డబ్బు చెల్లించకుండా మోసగించాడంటూ సర్పంచ్ ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించిన వివరాలను సర్పంచ్ రాజేష్ విలేకరులకు వెల్లడి చేయటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన లింగపాలెం మండలం లోనే కాక చింతలపూడి నియోజకవర్గంలోనూ, ఏలూరు జిల్లా అంతటా చర్చనీయాంశమయ్యింది. వీరిరువురు వైసీపీకి చెందినవారు కావటంతో ఈపార్టీలో ఈసంఘటన కలకలంగా మారింది. సర్పంచ్ నుంచి ఫిర్యాదు అందుకున్న డీజీపీ ఏలూరుజిల్లా ఎస్పీకి దర్యాప్తు చేయాలని ఆదేశాలు ఇచ్చారు.ఎస్పీ జంగారెడ్డిగూడెం డిఎస్పికి కేసును అప్పగించడంతో ఈయన దర్యాప్తు చేపట్టారు. జెడ్పీటీసీ వల్ల తాను ఆర్థికంగా మోసపోయానని సర్పంచ్ విలేకరుల వద్ద ఆవేదన వెలిబుచ్చారు. పోలీసుల ద్వారా న్యాయం జరుగుతుందని భావించి డిజిపికి ఫిర్యాదు చేశానని సర్పంచ్ తెలిపారు.గత కొంతకాలంగా వీరిరువురు మధ్య చోటు చేసుకున్న వివాదం పార్టీలోని కొందరు పెద్దల దృష్టికి వెళ్ళింది. సమస్యను పరిష్కరించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు వెళ్ళటం,ఇది వెలుగులోకి రావడం జరిగింది. జెడ్పీటీసీకి సంబంధించి పలు విషయాలపై డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుకు సంబంధించి జంగారెడ్డిగూడెం డిఎస్పి రవిచంద్రను విలేకరులు వివరణ కోరగా ఫిర్యాదు అందిందని దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

500 నోటుపై ఆచి తూచి..!

ఏజెన్సీలో నకిలీ జోరు...ఆందోళనలో వ్యాపారులు

విశాలాంధ్ర - కుక్కునూరు: వేలేరుపాడు మండలంలో రూ.500 నకిలీ నోట్ల చెలామణి వ్యవహారం బట్టబయలు కావడంపై కుక్కునూరు మండలంలో కూడా తీవ్ర ఆందోళన నెలకొంది. నాలుగు రోజుల క్రితం వేలేరుపాడు వైన్స్ షాప్ లో ఓ కస్టమర్ రూ. 500 నోటు ఇచ్చి మద్యం కొనుగోలు చేస్తుండగా షాపు సిబ్బంది నకిలీ నోటుగా గుర్తించారు. ఇప్పటికే పలు నకిలీ నోట్లు అక్కడి స్థానికులు గుర్తించారు. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన వేలేరుపాడు నకిలీ నోట్ల బాగోతంపై పొరుగునున్న కుక్కునూరు మండల వ్యాపారులు,ప్రజలు ఆందోళన చెందుతు న్నారు.ప్రధానంగా కిరాణా,పెట్రోల్ బంకు,వైన్స్, దుస్తుల దుకాణాల యజమానులు కస్టమర్ల నుంచి రూ.500 నోట్లను ఆచి.. తూచి తీసుకుంటున్నారు. బయట ప్రాంతాలకు చెందిన వారి నుంచి రూ.500 నోట్లను తీసుకోవడానికి కుక్కునూరు వ్యాపారులు జంకుతున్నారు. కాగా పలు ప్రాంతాల మిర్చి వ్యాపారులు కుక్కునూరు మండలంలో రూ.లక్షల్లో పెట్టుబడితో మిర్చి కొనుగోలు చేస్తున్నారు.

ఓ వైపు అరకొర అనుమతులు మరోవైపు తూకంలో రద్దీ చాటున వ్యాపారులు మిర్చి రైతులను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మిర్చి వ్యాపారులు కూడా రైతులకు నకిలీ నోట్లను అంటగట్టే అవకాశం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కప్పుడు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నకిలీ నోట్ల మార్పిడి జరిగిన ఘటనలు ఉన్నాయి.మళ్లీ నకిలీ నోట్ల చెలామణి వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో దుమారం రేపుతుంది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర -భీమవరం: చెట్లు, కొమ్మలు తొలగించుట లైన్లు మరమ్మతుల నిమిత్తము 21వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు లెప్రసి కాలనీ, గాంధీనగరం, టిడ్కో గృహ సముదాయం, భీమవరం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉపాధి కల్పించాలి

ఏఐటీయూసీ

విశాలాంధ్ర -ఏలూరు: రాష్ట్రంలో విద్యుత్ మీటర్ రీడర్స్ కు విద్యుత్ శాఖ లోనే ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏలూరు విద్యుత్ శాఖ ఎస్ ఈ కార్యాలయం వద్ద ఏపి. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం యూనియన్ నాయకులు ఎస్ఈ కి విజ్ఞాపన పత్రం అందజేశారు.ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో ఏలూరులో విద్యుత్ మీటర్ రీడర్స్ ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కోశాధి కారి కే మల్లేశ్వరరావు మాట్లాడారు. 2024 ఫిబ్రవరి మాసంలో విద్యుత్ శాఖ సీ ఎం డి రాష్ట్ర నాయకులతో చేసుకున్న లిఖితపూర్వక ఒప్పందంలోని హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్స్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 4500 మంది విద్యుత్ మీటర్ రీడర్స్

ఉపాధి కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ మీటర్ రీడర్స్ ను వాళ్ల విద్య అర్హతను బట్టి విద్యుత్ శాఖలోనే ఉపాధి కల్పించాలని వారు కోరారు. మీటర్ రీడర్స్ కు ప్రతినెల వేతనాలు చెల్లించుటకు ఎస్క్రో ఎకౌంట్ ని తక్షణమే ప్రారంభించాలని వారు ఎస్ ఈ కీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు జి. దుర్గారావు, డి. శంకర అప్పారావు, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎ. అప్పలరాజు, విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు కె. శ్రీధర్, వి. నారాయణ,కే శ్రీనివాసరావు, కె. వెంకట్రావు,కే మురళి, జంగారెడ్డిగూడెం డివిజన్,ఏలూరు డివిజన్ కు సంబంధించిన విద్యుత్ మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.

కోరం లేక మహాజనసభ వాయిదా

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం సొసైటీ మహా జన సభ కోరం లేక వాయిదా వేసినట్లు సొసైటీ అఫీషియల్ కమిటీ చైర్ పర్సన్ మాధవి మూర్తి తెలిపారు. టి నరసాపురం సొసైటీ సహకార రత్న రైతు ప్రాంగణంలో గురువారం నిర్వహించ తలపెట్టిన మహా జన సభ కోరం లేక వాయిదా పడింది. ఈ సందర్భంగా మాధవి మూర్తి మాట్లాడుతూ సహకార సంఘం నందు సుమారు 3,120 మంది సభ్యులు ఉండగా అందులో కేవలం 13 మంది సభ్యులు మాత్రమే హాజరు కావడంతో మహా సభను వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. మరల నిర్వహించే మహా జన సభ తేదీని ముందుగా రైతులకు కాన్వాసింగ్ ద్వారా తెలియపరుస్తామని ఆమె తెలిపారు. ఈ

కార్యక్రమంలో చింతలపూడి డిసిసిబి బ్యాంక్ మేనేజర్ చిట్టి బొమ్మ శ్రీనివాస్, సూపర్ వైజర్ కాసగాని రామకృష్ణ, సొసైటీ కార్యదర్శి మిండ ఆగస్టీన్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్య అభ్యాసకులకు 23న పరీక్షలు

విశాలాంధ్ర - నిడమర్రు: వయోజన విద్య ఉల్లాస్ అక్షరాస్యత ద్వారా శిక్షణ పొందిన నిరక్షరాసులకు అభ్యాసకులకు ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 10:00 నుండి సాయంత్రం 5-00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిడమర్రు ఎంఈఓ-1ఇ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. నిడమర్రు మండల సమాఖ్య డ్వాక్రా భవనంలో ఏ పి ఎం ఎం. రత్న కుమార్ బాబు అధ్యక్షతన పరీక్ష నిర్వహణపై తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యలపై కార్యక్రమం నిర్వహించారు. ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన అభ్యాసకులకు 270 మందికి 27 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 10 గంటల నుండి ఐదు గంటల లోపు ఎప్పుడైనా వచ్చి పరీక్షలు వ్రాయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం ఎం రత్న కుమార్ బాబు, డ్వాక్రా సిసిలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

25 వరకు అభ్యంతరాల స్వీకరణ

విశాలాంధ్ర-ఏలూరు: ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతులకు సంబంధించి టిఐఎస్ ఆధారంగా రూపొందించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను ఈనెల 25 లోగా జిల్లా విద్యాశాఖ కార్యాల యంలో తెలియజేయాలని డీఈఓ వెంకట లక్ష్మమ్మ తెలిపారు. ఉపాధ్యాయ సీనియర్టి జాబితాలను విద్యాశాఖ వెబ్సైటు ,నోటీసు బోర్డులలో ఇప్పటికే ప్రదర్శించినట్టు పేర్కొన్నారు.

ఐదేళ్లలో రూ.1,641 శ్రీనిధి నిధులు వినియోగం

ఎంపీ మహేష్ ప్రశ్నకు కేంద్రం బదులు

విశాలాంధ్ర - ఏలూరు : గత ఐదేళ్లలో సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్ (శ్రీ నిధి)కి విడుదల చేసిన నిధులు, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల పరిధి విస్తరణపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభ కరంద్లాజే గురువారం లిఖిత పూర్వకంగా సమాధానం

ఇచ్చారు. ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజీలో భాగంగా సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల కోసం రూ.50 వేల కోట్ల ఈక్విటీ ఇన్ఫ్యూషన్ 2020లో ప్రకటించబడిందని, ఈ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నుండి రూ.10 వేల కోట్లు, ప్రైవేట్ ఈక్విటీ వెంచర్ క్యాపిటల్ ఫండ్స్ ద్వారా రూ.40 వేల కోట్లు ఉందని, అమలుకు సంబంధించి ఎలాంటి సర్వే చేపట్టలేదని కేంద్రమంత్రి తెలిపారు. శ్రీనిధి కింద ఆంధ్రప్రదేశ్‌లో మూడు కంపెనీలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పథకం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు విడుదల కావని, 2025 ఫిబ్రవరి 28 నాటికి 577 సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు రూ.10,979 కోట్లు ఆర్థిక సాయం అందించగా, రూ.1,722 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్ఐసి వెంచర్ క్యాపిటల్ ఫండ్ లిమిటెడ్‌కు విడుదల చేయగా రూ.1,641.90 కోట్లు వినియోగించినట్లు కేంద్రమంత్రి బదులిచ్చారు.

గేట్‌లో సాయి చరణ్‌కు 9వ ర్యాంక్

విశాలాంధ్ర - కలిదిండి: ఆల్ ఇండియా గేట్ ప్రవేశ పరీక్షలలో సాయి చరణ్ 9 వ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం ఆరుతెగలపాడు గ్రామానికి చెందిన చిలుకూరి కిషోర్ బాబు, పల్లవి దంపతుల కుమారుడు సాయి చరణ్ కాకినాడ జేఎన్‌టియులో ఇంజనీరింగ్ చదివి

హైదరాబాద్‌లో గేట్ కోచింగ్ తీసుకుని తొలి ప్రయత్నంలోనే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో 77.67 శాతం మార్కులతో 9వ ర్యాంకు సాధించారన్నారు. ఐఐటీలో ఎంటెక్ చదవాలన్న ఆశయంతో కష్టపడి చదివినట్లు సాయి చరణ్ తెలిపాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సాయిచరణ్‌కు అభినందనలు తెలియజేశారు.

ఆవిరవుతున్న ప్రకృతి సంపద

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, మట్టిలో కలిసిపోతోంది ప్రకృతి సంపద. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పరింపూడి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏళ్ల తరబడి ఉన్న టేకు చెట్టును గత వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నూతన

సచివాలయాలను నిర్మించాలని రాష్ట్రవ్యాప్తంగా ఆదేశాలు జారీ చేయడంతో దీనిలో భాగంగా కొయ్యలగూడెం మండలంలో అనేక గ్రామాలలో నూతన సచివాలయ భవనాలు నిర్మాణాలు చేపట్టగా,పరింపూడి గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణాన్ని నిర్మించాలని , పాత భవనాన్ని తొలగించి,నూతన భవన నిర్మాణానికి అడ్డుగా ఉన్న టేకు చెట్టును కూడా తొలగించారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాన్ని మహిళా మండలి భవనం లో నిర్వహిస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం తొలగించిన టేకు చెట్టు కలపను కార్యాలయం వద్ద ఉంచారు. ఎంతో విలువైన టేకు చెట్టు కలప ఎండకు ఎండుతూ,వానకు తడుస్తుండడం వలన చెద పట్టి మట్టి పాలు అయ్యేలా ఉంది. దీనిపై గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్‌ను వివరణ కోరగా ఉన్నత అధికారులకు తెలియజేసి, ఆదేశాలు రాగానే,అటవీశాఖ అధికారులకు తెలిపి, వేలంపాట నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ దోహదం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మహిళల భద్రతకు శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందని మహిళ పోలీస్ స్టేషన్ సిఐ ఎం.సుబ్బారావు సూచించారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సిఐ సుబ్బా రావు నేతృత్వంలో గురువారం

ఏలూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో "శక్తి యాప్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగం, దాని ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ యాప్, అత్యవసర సందర్భాల్లో కేవలం ఒక్క క్లిక్‌తో పోలీసులకు సమాచారం చేరేలా రూపొందించబడిందని వివరించారు. మహిళలు తమ భద్రతకు సంబంధించిన సమస్యలను భయపడకుండా, సంకోచం లేకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. శక్తి యాప్ ద్వారా ఎలాంటి పరిస్థితుల్లోనైనా తక్షణ సహాయం పొందవచ్చని, ఏదైనా అసౌకర్యం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు, మహిళా పోలీస్ అధికారులు తదితరులు పాల్గొని, శక్తి యాప్ వినియోగంపై ప్రాముఖ్యతను తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు

విశాలాంధ్ర - ఏలూరు: వైయస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగిన 34వ సబ్ జూనియర్ అంతర్‌జిల్లాల బాల బాలికల కబడ్డీ పోటీలలో మూడవ స్థానం సాధించిన పశ్చిమగోదావరి జిల్లా జట్టును పలువురు అభినం దించారు. పెదపాడు మండలం వీరమ్మ కుంట జడ్పీ హైస్కూల్ లో క్రీడాకారులకు అభినందన సభ జరిగింది. వీరమ్మ కుంట గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు షణ్ముఖం లను గ్రామ స్తులు అభినందించి,శు భాకాంక్షలు తెలిపారు. అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఎస్ ఎం సి వైస్ చైర్మన్ కళ్యాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చేనేతకు ఉచిత విద్యుత్తు హర్షణీయం

చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం చేనేతకు ఉచిత విద్యుత్తును మంత్రివర్గం ఆమోదించడం హర్షణీయం అని చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల సందర్భంలో చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుకు చేనేతకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నట్లు చేసిన ప్రకటన పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు వర్క్ షెడ్ లను ప్రభుత్వం నిర్మించి, రూ.5 లక్షలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.చేనేత కార్మికులకు సిల్క్ రాయితీని టిడిపి ప్రభుత్వం గతంలో ఉన్నప్పుడు ఇచ్చేవారని దానిని పునరుద్ధరించాలని కోరారు. వీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి,11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు బ్యాంకులో వ్యక్తిగత పూచీకత్తుతో రూ.5 లక్షల సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలన్నారు. జీవర్స్ చేనేత సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ వివరాల నమోదు పూర్తి చేయాలి

- 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సువారి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి
- జిల్లాస్థాయి ఆధార్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలో 5 సంవత్సరాల లోపు పిల్లల ఆధార్ వివరాలు నమోదును పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఆధార్ మోనటరింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆధార్ ఎన్‌రోల్ మెంట్, ఆధార్ బయోమెట్రిక్, అప్ డేట్ అంశాలపై సమీక్షించారు. ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించా లన్నారు. జిల్లాలో 5 సంవత్సరాలోపు ,15-17 వయస్సు ఉన్న విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ అవసరాన్ని నొక్కిచెప్పారు. నీట్, జెఈఈ వంటి జాతీయ ప్రవేశ పరీక్షల్లో సజావుగా నవీకరణ ఉండేలా,సమస్యలను నివారించ దానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆధార్ కార్డుల నవీకరణ పెండింగ్ ప్రక్రియపై దృష్టిసారించా లన్నారు. గడిచిన 30 రోజుల్లో జిల్లా పరిధిలో 57,481 ఆధార్ కార్డుల నమోదు ప్రక్రియ జరిగిం దన్నారు. ఆధార్ నవీకరణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిం చాలని సూచించారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో, అనాథ శరణాయాల్లో ఉన్న పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో వచ్చే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంపై ఐసిడిఎస్ పిడి సంబంధిత వివరాలను ఉడయ్ సంస్థ అధికారులకు అందజేయాలన్నారు.సరైన ఆధార్ గుర్తించ డంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేసే వివరాలను కరపత్రాల రూపంలో ప్రచురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఉడయ్ సంస్థ అసిస్టెంట్ మేనేజరు జి. గిరిధర్,జెడ్పి సిఇఓ భీమేశ్వరరావు, ఎల్డిఎం డి.నీలాద్రి, ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్,సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, డ్వామా పిడి సుబ్బారావు, డిఇఓ వెంకటలక్ష్మమ్మ, ఐసిడిఎస్ పిడి పి.శారద, ఆర్.ఐ.ఓ. యోహాన్, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ఎంపి డివో కార్యాలయ సమావేశ మందిరంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) సంస్థ ఆధ్వర్యంలో కె. హెరాల్డ్ బాబు అధ్యక్షతన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధు లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు జే. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణకు ఎంతో కృషి చేస్తుందని జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న బాలల సంక్షేమ,రక్షణ సమన్వయ కమిటీలలో స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీడబ్ల్యూసీ ఇన్ చార్జి ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సేవా సంస్థలు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కార్యదర్శి నేతల రమేష్ బాబు

మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు సేవా సంస్థలు సమన్వయంతో కలిసి పని చెస్తేనే మెరుగైన ఫలితాలు కనపడతాయని జిల్లా కలెక్టర్, చొరవ తీసుకుని వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో స్వచ్ఛంద సేవా సంస్థలతో సమావేశం నిర్వహించా లని కోరారు. ఈ కార్యక్రమంలో జే శివకృష్ణ,యం నికోల,సేవా రాజారావు, సీహెచ్ ప్రభాకర్ రావు,యస్. రవిబాబు,ఆర్ వినోద్ కుమార్, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్న అర్హులైన పేదలు క్రమబద్ధీ కరణ కొరకు కొయ్యలగూడెం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకొని వాటిని క్రమబద్ధీకరించు కోవాలని కొయ్యలగూడెం తహసీల్దార్ తెలిపారు. మండల పరిధిలోని 2019 సంవత్సరానికి ముందు అనధికారకంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో ఇండ్లు నిర్మించుకొని నివాస ముంటున్న వారు జీవో నెంబర్ 30 సీసీఎల్ఏ , ఏలూరు జిల్లా కలెక్టర్ వారి ఉత్తర్వుల మేరకు సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నట్లు యితే వాటిని క్రమబద్ధీకరిం చేందుకు సంబంధిత దస్తావేజులు ఇంటి పన్ను కరెంటు బిల్లు మంచినీటి కుళాయి పన్ను తదితర అంశాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం ఇంటి మహిళపై క్రమబద్ధీకరించి ఇవ్వనున్నట్లు తహసీల్దార్ చల్లన్న దొర తెలియజేశారు.

వీఆర్వోలకు పదోన్నతులు కల్పించండి

వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. రవీంద్ర రాజు

విశాలాంధ్ర-ఏలూరు: అర్హులైన వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా రవీంద్ర

రాజు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అర్హులైన గ్రేడ్1, వీఆర్వోలు కు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇవ్వాలని,గ్రేడ్ 2,గ్రామ రెవెన్యూ అధికారులకు గ్రేడ్ వన్ వీఆర్వోలు గా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. క్లస్టర్ విధానం పేరుతో రెవెన్యూ విలేజ్‌లకు సంబంధం లేకుండా,రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. క్లస్టర్‌కు ఒక విఆర్ఓ ఉండేలాగా నిర్ణయం తీసుకోవడం వల్ల వీఆర్వోలకు పని భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.రెవెన్యూ సేవలు కూడా ఆలస్యం అవుతాయని, ఈనెల25,26 తేదీల్లో ముఖ్యమంత్రితో రాష్ట్ర సచివాలయం లో జరిగే కలెక్టర్ల సదస్సులో ఈ క్లస్టర్ విధానం గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీ నారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షులు రాంబాబు,జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అక్బర్ జిల్లా కోశాధికారి రవికుమార్, ఏలూరు డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు,అజయ్ జంగారెడ్డిగూడెం డివిజన్ అధ్యక్షులు, అడపా రాంబాబు,నూజివీడు డివిజన్ సెక్రెటరీ శ్రీనివాస్, జాన్, ఎ. శ్రీనివాస్, సూర్యకుమారి, కిషోర్, అనిరుద్ధ, ఏలూరు,పెదవేగి, దెందులూరు, పెదపాడు, మండలాల వీఆరోఓలు పాల్గొన్నారు.

వీఆర్వోలపై పని భారాన్ని తగ్గించాలి

విశాలాంధ్ర - పాలకోడేరు : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల రేసనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానం వల్ల రెండు సచివాలయం కలిపి ఒక క్లస్టర్ చేయడం జరుగు తుందని ఒక రెవిన్యూ విలేజ్ లో

ఉన్న సచివాలయాన్ని మరొక రెవిన్ విలేజ్ లో ఉన్న సచివాలయం కలిపి క్లస్టర్ గా చేయడం వల్ల ఒక సచివాలయానికి మరొక సచివాలయానికి ఆరు నుండి 8 కిలోమీటర్ దూరం ఉండడం వల్ల వీఆర్వోలకు ఇబ్బంది కలుగుతుందని మరియు ఈ క్లస్టర్ విధానం వల్ల రెవెన్యూ డిపార్ట్మెంట్ అధికారులను పరిగణలోనికి తీసుకోకుండా కేవలం జి ఎస్ డబ్ల్యు ఎస్ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం రూరల్ మండలాల్లో ఎంపీడీవోలు, అర్బన్ ఏరియాలో మున్సిపల్ కమిషనర్ ద్వారా ఏపీ పోర్టల్లో ఈ క్లస్టర్ మ్యాపింగ్ చేయడం జరుగుతుందని దీనివల్ల విఆర్వోలు చాలా అగచాట్లు పడుతున్నారని పాలకోడేరు వీఆర్వోలు వాపోయారు. దీనికి సంబంధించి వినతిపత్రాన్ని గురువారం మండల తహసిల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో పాలకోడేరు మండల వీఆర్వో సంఘ అధ్యక్షులు పి.సురేష్, కార్యదర్శి భోగేశ్వరరావు, వీఆర్వోలు కోటేశ్వరరావు, జి. శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, ఇందిరా, కృష్ణంరాజు, పుల్లయ్య, పెన్నాద సుబ్రహ్మణ్యం, శ్రీను, ప్రసాద్, మధు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో దక్షిణ భారత వ్యవసాయ ప్రదర్శన

విశాలాంధ్ర-లింగపాలెం: ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల27నుంచి29 వరకు గుంటూరులోని దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ కె. ఫణికుమార్ తెలిపారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ప్రదర్శనలో రైతుల-శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రదర్శనకు రైతులను ఉచితంగా తీసుకెళ్తామని, ఔత్సాహిక రైతులు ఏరువాక కేంద్రం, ఏలూరు వారి కార్యాలయ నెంబర్ 9989623804కు సంప్రదించాలని కోరారు.

పీఎండీఎస్ విత్తనాల కిట్లు రైతులకు అందించాలి

విశాలాంధ్ర - కరప : ప్రకృతి వ్యవసాయంలో పిఎండి ఎస్ ప్రాముఖ్యతను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏలియాజార్ కేడర్‌కు వివరించారు. కరప మండలం, కొంగోడు గ్రామంలో గురు వారం పర్యటించి, ప్రకృతి వ్యవసాయం యూనిట్ పరిశీలిం చారు. కరప డివిజన్ ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది అందరూ ఏర్పాటు చేసిన పీఎండిఎస్ విత్తనాల కిట్లను రైతులకు అందించేందుకు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పిఎండిఎస్ ప్రాముఖ్యత ఎంతగానో ఉపయోగప డుతుందని ఆయన తెలిపారు. పంట కోతకు వచ్చే సమయ ంలో నేలను ఎండి పోకుండా పచ్చదనంగా ఉండేందుకు పిఎండిఎస్ విత్తనాలు రైతులతో వేయించి భూమిలో సూక్ష్మ దాతువులు పెరిగేందుకు ఎంతగానో తోడ్ప డుతుందన్నారు. ఘనజీవామృతాన్ని ముందుగానే తయారుచేసి రైతులకు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు. స్థానిక మెంటల్ అర్జున్ కుమార్ ఫీల్డ్ పరిశీలించి తగిన సూచనలు సలహాలను డిపిఎం ఏలియాజర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది. ఎంటి ధనలక్ష్మి, కరప డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోన సీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని రామచంద్రపురం ఆర్‌డివో డి అఖిల రైతులకు విజ్ఞప్తి చేశారు. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామపంచాయితి కార్యాలయంలో నిర్వహించిన రైతులు అవగహన కార్యక్రమంలో ఆర్‌డీవో మాట్లాడారు. గత రీ సర్వే జరిగిన తప్పిదాలను సరిచేసి సక్రమంగా రికార్డులు తయారు చేయడం ప్రస్తుత రీ సర్వే ప్రభుత్వం చేపట్టిందని ఆర్‌డివో అఖిల పేర్కొన్నారు. సర్వే అధికారులు పిలిచినప్పుడు రైతులు వచ్చి, భూ వివాదాల పరిష్కారానికి సహకరించా లని ఆర్‌డీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడిసెట్టి సత్య వేణి దుర్గారావు, సర్పంచి కుక్కల నాగమణి, తహశీల్దార్ చిన్నా రావు, ఆర్‌ఐ ఆర్జమ్మ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎన్ శ్రీనివాస్, టీడీపి నాయకులుదాసరి శ్రీనివాస్, మేడిశెట్టి శ్రీనివాస్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అర్జీదారుల నుంచి ఫీడ్ బ్యాక్

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురం గ్రామంలో అర్జీదారుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరిగిందని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శి రామ్నాథ్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను నాతి బుజ్జి పరిశీలించారు. అర్జీలను పరిష్కరించి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. పిజిఆర్ఎస్‌లో నమోదు చేయబడిన ఫిర్యా దుల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్త స్థాయి, పరిష్కరిం చిన విధానాన్ని పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేసారు. ఉద్యోగులు జవాబుదారీ తనంతో పనిచేసి, ప్రభు త్వంపై ప్రజల విశ్వసనీయతను పెంచేందుకు ఈవిధంగా ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామనాథ్, సిబ్బంది ఉన్నారు.

వృద్ధులకు భోజనం పంపిణీ

విశాలాంధ్ర - నిడదవోలు : పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడ వరపు భద్రం దొర పుట్టిన రోజు వేడుకను చర్ల సుశీల వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వేడుక సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పేదలకు భోజనం, బిస్కెట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రందొర మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ఇలా సేవా కార్యక్రమం చేయడం నేను అదృష్టంగా భావిస్తున్నానని, వృద్ధులు ఆకలి తీర్చడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, జీవివి సత్యనారాయణ, పుచ్చకాయల వరప్రసాద్, షేక్ కాసిం, కళ్లెం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి దృష్టా ప్రత్యేక చర్యలు చేపట్టాలి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ఈ వేసవి సీజన్‌లో ఎండల తీవ్రత అధికంగా ఉండే అశకాశం ఉందని, వడగాలులు కూడా వీస్తాయని, అందువలన ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరిగిందని, అనుకోని సంఘటనలు జరగకుండా ప్రజలను కాపాడవలసిన భాధ్యత ఉందన్నారు. ప్రజలకు సరైన సమాచారం అందించడం కోసం త్రీమ్యాన్ కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏమైన సంఘునలు జరిగినా అధికారులు త్రీమ్యాన్ కమిటీ ద్వారా 24 గంటల్లో సమాచారం అందించాలని సూచించారు. అన్ని పాఠశాలలు, అంగన్ వాడీ సెంటర్లు ఒంటి పూట నిర్వహించాలన్నారు. ఉపాధి హామి కూలీలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వృద్ధులు , బాలింతలు, పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమల ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చెయ్యాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పి. హెచ్.సిలు, సి. హెచ్.సిలలో ఓఆర్ఎస్ ఫ్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పంచాయితీల ఆధ్వర్యంలో గ్రామాల్లో టాం టాం వేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

బలభద్రపురంలో కాన్సర్‌కు కారణాలు విశ్లేషించండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే నలమిల్లి రామకృష్ణరెడ్డి

విశాలాంధ్ర-అనపర్తి : బిక్కవోలు మండలం బలభద్రపురంలో సుమారు 200 నుండి 300 మంది క్యాన్సర్ బారిన పడటం చాలా ఆందోళన కలిగించే విషయమని శాసనసభ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం శాసనసభ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ఏ గ్రామంలో లేని విధంగా బలభద్రపురంలో ఏకంగా సుమారు 200 నుండి 300 మంది క్యాన్సర్ బారిన పడటమే కాకుండా 30 మంది వరకు క్యాన్సర్ వ్యాధితో మృతి చెందారని సభ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనికి కారణమేమిటో అంతు పట్టని పరిస్థితి నెలకొందని, గ్రామస్తుల్లో మాత్రం అప్పటి వైసిపి ప్రభుత్వం, అప్పటి అవినీతి ఎమ్మెల్యే నిర్వాకంతో సల్ఫ్యూరిక్ యాసిడ్, కాస్టిక్ సోడా లాంటి 56 రకాల కెమికల్స్ ఉత్పత్తి చేసే గ్రాసిమ్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయడం వలనే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సంబంధించిన ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా నిమిత్తం వందలాది వాహనాలు గ్రామంలో తిరగడం వలన వాయు, శబ్ద కాలుష్యంతో పాటు జర కాలుష్యం కూడా ఏర్పడుతుందని ప్రజలంతా భావిస్తున్నారంటూ సభలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రసంగించారు. అనేకసార్లు కోరినప్పటికీ పర్యావరణ శాఖ ఏ విధమైన చర్య చేపట్టలేదని అన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున క్యాన్సర్ బారిన పడుతున్నందున ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి క్యాన్సర్‌కు కారణాలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి కోరారు. ప్రత్యేకంగా పర్యావరణ, వైద్య ఆరోగ్య శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభ ద్వారా రామకృష్ణారెడ్డి కోరారు.

మహిళలు చట్టాలపై అవగాహన ఉండాలి : సీఐడీ

విశాలాంధ్ర - రావులపాలెం : మహిళకు ఆపద వచ్చిన సమయంలో తమను తాము రక్షించుకునేందుకు ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటి గురించి తెలుసుకోవాలని సీఐడీ సీఐ జేమ్స్ రత్నప్రసాద్ అన్నారు. రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యర్ ఆదేశాల మేరకు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. సీఐడీ సీఐలు జేమ్స్, స్వామి, బి వెంకటేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసుత్త సమాజంలో మహిళలపై అత్యా చారాలు, కళాశాలల్లో యువతులపై రాగ్యింగ్, ప్రేమ పేరుతో మోసపోవడం ఎన్నో జరుగుతున్నాయన్నారు. మహిళల కోసం ప్రభుత్వాలు ఎన్నోచట్టాలను తీసుకువచ్చిం దని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఆపద సమయంలో ఎవరిని సంప్రదించాలి రక్షణ కోసం చేయాల్సిన పనుల గురించి వివరించారు. ఎవరైనా ప్రభుత్వం, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని వివరాలు తెలపాలని, ఓటీపీ అడిగినా సంబం ధిత కార్యాలయాలు, బ్యాంకుల వద్దకు వెళ్లి తెలుసుకోవాలని ఫోన్లో ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్అధికారిఅరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత మేలుకో కార్యక్రమంపై అవగాహన

విశాలాంధ్ర - పెదపూడి : పిల్లలు చక్కని బాటలో నడిచే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని తద్వారా పిల్లలు ఉత్తమ పౌరులుగా, సన్మార్గంలో పయనిస్తారని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. దోమాడ గ్రామంలో యువత మేలుకో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన సదస్సు బుధవారం ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతాపతి రావు, ఈఓపీఆర్డీ ఎం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చాలామంది చిన్న వయస్సు నుంచే మత్తు మందులకు అలవా టుపడి వారి విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్నార న్నారు. యువత మత్తుమందుకు అలవాటు పడకుండా చూడా ల్సిన బాధ్యత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ఉందన్నారు. అలాగే మత్తు మందుల వినియోగం వాటి దుష్ట ఫలితాలు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆలీ, వీఆర్వో పూసల నాగేశ్వరరావు, ఎక్సైజ్ హెచ్సీ రాజు, సిబ్బంది సుబ్రహ్మణ్యం, శివరాజు, కొప్పోజు సూర్యసత్తి బాబు, పొన్నం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటి పన్ను వసూలకు కృషి

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : పెదపూడి పంచాయతీలోఇంత వరకు 92 శాతం ఇంటి పన్ను వసూలు చేయడం జరిగిందని వారం రోజుల్లో మిగిలిన ఇంటి పన్ను కూడా వసూలు చేయాలని కార్యదర్శిని మండల విస్తర్ణాధికారి మేడపాటి సత్యనారాయణ రెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక పంచాయతీ రికార్డులను ఇవోపిఆర్డి ఎంఎస్ఎన్ రెడ్డి పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం పనులు ఇంకా మెరుగుపరిచి, డ్రైనేజ్‌లో సీల్ట్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, వీధి దీపాలు వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని కార్య దర్శులకు ఇవోపిఆర్డి సూచించారు. గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శి జి ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ జి అనంతలక్ష్మి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలని నిరసన

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఎబిసిడి ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిలుపుదల వేయాలని మాలమహానాడు నాయకులు గురువారం కాట్రేనికోన గెట్ సెంటర్ నందు రోడ్డుపై బైటాయించి ప్రభుత్వతీరుకు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీలు ఎంతమంది ఉన్నారు. ఎస్సీలలో ఎన్ని ఉకులాలు ఉన్నాయి అంటూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రంజన్ మిశ్రా కమిషన్ తప్పులు తడక నివేదిక ప్రభత్వానికి అందచేసిందన్నారు. ఇన్నాళ్లు ఎక్కడ కనపడని 59 ఉపకులాలు ఎస్సీల్లో వున్నారంటూ రంజన్ మిశ్రా కమిషన్ కేవలం మాలలను అణగదొక్కాలనే కుట్రతో ఎబిసిడి వర్గీకరణ పేరుతో మాకు రిజర్వేషన్స్ తగ్గించాలని ప్రభుత్వం కుట్రపన్ని మా సంఖ్యబలం తగ్గిస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ నిలుపుదల వేయాలని ఎబిసి వర్గీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రంజన్ మిశ్రా ఎకసభ్య కమిషన్ తీసివేసి త్రిసభ్య కమిషన్ వేయలాని అసలు రాష్ట్రంలో యస్సిల్లో ఎన్ని ఉపకులాలు వున్నాయో తేల్చలాని సంఖ్యబలం ఆధారంగా జనాభా లెక్కలు నిగ్గు తెల్చాలన్నారు. వర్గీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేయకపోతే డా బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా సాక్షిగా కాట్రేనికోన మండలంలో శుక్రవారం నుండి వర్గీకరణకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేపడతాం అని, అప్పటికి ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ప్రాణాలైనా అర్పిస్తాం వర్గీకరణ అడ్డుకుంటాం అనే నినాదంతో ఆమరణ నిరాహార దీక్ష చెపడతాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు కాట్రేనికోన తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో మాల నాయకులు నల్లా నరసింహమూర్తి, కాశి హనుమంతురావు, గెల్లా రాజేంద్ర, వడ్డిశ్యామ్ ప్రసాద్, జనిపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- కనీస వేతనాలు ఇప్పించండి
- సీఎం, డిప్యూటీ సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్
- ఎలక్ట్రికల్ ఎస్ఈకి వినతి పత్రం అందజేసిన సంఘ నాయకులు

విశాలాంధ్ర - కాకినాడ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న విద్యుత్తు మీటర్ రీడర్స్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ మీటర్స్ రీడర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కాకినాడ కుళాయి విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ మీటర్ రీడర్స్, సంఘ నాయకులు తెలుగు తల్లి విగ్రహం నుండి భారీ ర్యాలీగా ఫ్లెక్సీలతో కరపత్రాలతో బయలుదేరి ఉద్యోగ భద్రత కల్పించాలని సీ ఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అని నినాదాలు చేస్తూ ఎలక్ట్రికల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం కాకినాడ డివిజన్ బివిఎస్ రావు, జగ్గం పేట డివిజన్ పి నానాజీ మీడియాతో మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని చాలీ చాలని పీస్ రేటు కమిషన్‌తో నెల మొత్తంలో 10 రోజులకే ఉద్యోగాన్ని కుదించి పొట్ట కొట్టారన్నారు. టెక్నాలజీకి మేము అడ్డు రాము అని కానీ మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి మినిస్టర్ నారా లోకేష్, స్పీకర్ చింతకాయల అయ్య న్నపాత్రుడు, హెూమ్ మినిస్టర్ వంగలపూడి అనిత కలిసి వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరామని, కానీ ఇప్పటికే ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించడం లేకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టడం జరిగిందని, ఇప్పటికైనా ఈ ప్రభుత్వంస్పందించి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పన కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో కాకినాడ డివిజన్ నాయకులు ఎం వీరబాబు, డివిఎస్ ఎన్ రెడ్డి, ఎస్‌కె మదీనా, నూకరాజు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : సీఎం సహాయనిధి చెక్కులను గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. మండలంలోని మల్లిశాల గ్రామానికి చెందిన వనందుర్గాప్రసాద్‌కి రూ.50 వేలు, బీర నాగేశ్వ రరావుకి రూ. 61,049, సిరిపురం వీర వేణికి రూ.37,551 చెక్కులను బాధితులకు అందజేశారు. అలాగే గండేపల్లి మండలం బొర్రం పాలెం గ్రామానికి చెందిన మంగిన ఉమామహేశ్వరావు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం సమకూర్చిన రూ.4.30వేలు ఎల్‌వోసి లెటర్ నవీన్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ఆరోగ్యం దేశాభివృద్ధికి మూలమని, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం ఆశాజ్యోతి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైడిపాల సూరిబాబు, ముంద్రు ఎర్రబాబు, సర్వసిద్ది లక్ష్మణరావు, సింగరమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ తొట్టిపూడి నాగేశ్వర రావు, కనవర్రెడ్డి రామకృష్ణ, గండేపల్లి మాజీ జడ్పిటిసి ఎర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి, పల్లపు సుబ్బారావు, గుమ్మళ్ల అనంతలక్ష్మి, తొగరు యేసు పాల్గొన్నారు.

అరకు కాఫీని ఆస్వాదించిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

విశాలాంధ్ర - కాకినాడ : అసెంబ్లీ ఆవరణలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏపీ బ్రాండ్ అరకు కాఫీని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆస్వాదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరకు కాఫీ అనేది ఆర్గానిక్‌గా పెరిగే, అద్భుతమైన రుచిని కలిగిన కాఫీ అని ఈ కాఫీ ప్రత్యేకత సున్నితమైన సువాసన, మృదువైన రుచి కలిగి ఉండి, సహజమైన పద్దతిలో ఉత్పత్తి జరుగుతుందని, ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఈ అరకు కాఫీ, ఆంధ్రులకు, భారతీయులకు గర్వంకారణంగా నిలుస్తోందని తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సభాపతి, ఉప సభాపతులకు, ధన్యవాదాలు తెలిపారు.

అనాదికార చేపల వేటపై చర్యలు తీసుకోవాలని వినతి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించే ఎన్ఎఫ్ఎల్ చెరువులో అనాదికార చెప్పాలవేట కొనసాగుతుం దని, దానిపై చర్యలు చేపట్టి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. గురువారం ఆయన కమిషనర్‌ను కలిసి ఫిల్టర్ బెడ్ చెరువు పరిస్థితి పై వివరించారు. ఫిషర్ మెన్ సొసైటీకి చేపలవేటకు ఇచ్చిన గడువు ఈనెల 16వ తేదీతో ముగిసిందని, తదుపరి 10 రోజుల్లో చెరువును మొత్తం ఎండగట్టి తదుపరి కొత్తగా నీరు పెట్టాలని చెప్పగా చేపల వేటకోసం రాత్రి సమయాల్లో ఔట్లెట్స్ వాల్వ్ ఆపి అన్యధికారికంగా చేపలవేట కొనసాగిస్తున్నారని వివరించారు. అలా చెరువు జలాలు బయటకు వెళ్లకుండా అనాదికారి కంగా చేపల వేట నిర్వహించే వారిపై చర్యలు తీసుకుని చెరువు ద్వారా పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కౌన్సిలర్ హరిబాబు కమిషనర్‌ను కోరారు.

ఆదిత్య యూనివర్సిటీలో జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామ రాజు, యానాం జిల్లాల స్థాయి "వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025" నిర్వహించడానికి నోడల్ సంస్థగా ఆదిత్య యూనివర్సిటీ ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఎంపిక చేసిన విషయం విదితమే. అయితే 21, 22 తేదీల్లో రెండు రోజులు కాకినాడ, తూర్పు గోదావరి, డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామ రాజు, యానాం జిల్లాల నుంచి యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో 18 నుంచి 25 సంవత్సరాలు పూర్తైన వారు సుమారు 585 మంది mybharat.gov.in పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని వీడియో అప్‌లోడ్ చేయడం ద్వారా 170 మందిని స్క్రీనింగ్ ద్వారా ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డా ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సెలెక్ట్ అయిన విద్యార్థులు 4 నిమిషాలపాటు వన్ నేషన్-వన్ ఎలక్షన్ అనే అంశం పై మాట్లాడాలి అని తెలిపారు. సెలెక్ట్ అయిన విద్యార్థులకు ఫోన్, ఈ మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహించే పోటీలలో ఉత్తమ స్పీకర్లను 10 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతారని తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ ఎంబి శ్రీనివాస్, ప్రో-వైస్ ఛాన్సిలర్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డా జి సురేష్, డీన్ ప్రొ వి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు బి రాంబాబు, ఐవి రామాంజనేయులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు దేవదుల సూర్య నారాయణమూర్తి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ టీడీపీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వము ఇచ్చిన హామీలను నెరవేర్చక కాలయాపన చేస్తోందని, అర్హులైన పేద ప్రజలకు పట్నాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు హామీ ఇచ్చిందని, ఇంతవరకు కూటమి ప్రభుత్వము అర్హుల జాబితాని తయారు చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు కావస్తుందని, పట్నంలో ఉన్న వారికి పట్నంలో పట్టాలు ఇవ్వాలని, పల్లెటూరులో నివసించే వారికి పల్లెటూర్లోనే పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండు లక్షల పైగా ఉన్న వాలంటరీలకు విధుల్లోకి తీసుకుని నెలకు పదివేల రూపాయలు ఇస్తానని చెప్పిన మాట మార్చారని, వాలంటరీ వ్యవస్థను పునర్దించకుండా కాలయాపన చేస్తూ వాళ్ళని విధుల్లోకి తీసుకోకుండా ఉన్నది, బాబు జాబు అంటూ వాగ్దానాలు చేసి నేడు వాళ్ళకి జాబు లేకుండా చేసినారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇసుక బల్క్ ఆర్డర్స్ పక్కదారి పడుతున్నాయా?

విశాలాంధ్ర - సీతానగరం: ఇసుక బల్క్ ఆర్డర్స్ పక్కదారి పడుతున్నాయా? మండలంలో వంగలపూడి గ్రామ పంచాయితీ పరిధిలో ప్రభుత్వం రెండు ఇసుక ర్యాంపులను అనుమతులు మంజూరు చేసి ర్యాంపుల నిర్వహణ జరుగు తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ ఇసుక ర్యాంపు ఒకటి నుండి ప్రభుత్వం పనుల నిమిత్తం కాకినాడ దగ్గర ఉన్న చిత్రాడ గ్రామానికి బల్క్ రూపంలో ఇసుకను సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఈ బల్క్ అనుమతుల పేరుతో ఇసుకను బయటకు తరలిస్తున్నారు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తు న్నాయి. పక్కదారి పడుతున్న అనుమతులను గుర్తించి తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ ఉచిత ఇసుక విధానాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మలగిరి మేరీ మాత ఉత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: నిర్మలగిరి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి జయరావు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్మలగిరి మేరీ మాత ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఇదేవిధంగా నిర్మగిరి మేరీ మాత పుణ్యక్షేత్రం స్థాపించిన 40 సంవత్సరాలు అయిందని ఆయన తెలిపారు. ఇదేవిధంగా 2000 సంవత్సరంలో నిర్మలగిరి క్షేత్రంలో ప్రధాన ఆలయం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తైందని ఆయన తెలిపారు. జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాలకు ఆంధ్ర ప్రదేశ్ లో తెలంగాణలో కర్నూలు నెల్లూరు ఖమ్మం విజయవాడ కడప పీఠాధిపతులు పాల్గొన్నారు. మద్రాసు మైలాపూర్ అగ్ర పీఠాధిపతి జాన్ అంతోని స్వామి నిర్మల్ గిరి పుణ్యక్షేత్రం ఉత్సవాలకు ఆయన పాల్గొంటారని బిషప్ జయరావు తెలిపారు. నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ వివిధ ప్రాంతాల నుండి సుమారు పది లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా వేస్తున్నామని తెలిపారు. పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ మాట్లాడుతూ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమిష్టి బలి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫాదర్ బాల ఫాదర్ మోజెస్ ఇమ్మానుయేలు రాజు ఆంటోనీ పాల్గొన్నారు.

వడగాల్పులపై ప్రజలకు అవగహన కల్పించండి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ఎండల తీవ్రతను బట్టి వడ గాల్పులు వీచే అవకాశం ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించా లని తూర్పు గోదావరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వైద్య శాఖ సిబ్బందికి సూచించారు. గురువారం తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లాలో రాభోవు రోజుల్లో వడ దెబ్బను ఎదుర్కోనేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. వేశవిలో తీసుకోవలసిన చర్యలు, నియంత్రణ, నివారణ చర్యలు, జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రచారం చెయ్యాలన్నారు. భారత వాతావరణ శాఖ సూచనలు, మార్గదర్శకాల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర. సిఐఎన్ నం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

సెక్యూరిటైజేషన్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు

వీహెచ్ఎఫ్‌సిఎల్ నుండి పొందిన పరపతి సౌకర్యాల యొక్క వడ్డీని చెల్లించడంలో మరియు అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. అందుచేత సదరు పరపతి సౌకర్యాలు నిరర్థక ఆస్తులుగా మారాయని వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ముంబైలోని దాని ప్రధాన కార్యాలయం ద్వారా ఈ క్రింది రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులకు నోటీసు జారీ చేయడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద వారికి ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి వారికి అందజేయబడక తిరిగి వచ్చినందున బహిరంగ నోటీసు మార్గంలో వారికి దీని గురించి తెలియజేయడమైనది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి	తనఖాపెట్టబడిన ఆస్తి యొక్క వివరాలు
అయ్యప్పస్వామి తాటికాయల (రుణగ్రహీత), వరలక్ష్మి తాటికాయల (సహ-రుణగ్రహీత) LP000000055586	11-ఫిబ్రవరి -25 తదుపరి వడ్డీ మరియు దానిపై చార్జీలతో 10-ఫిబ్రవరి-25 నాటికి రూ.2048772/-	తూర్పుగోదావరి జిల్లా, రాజోలు సబ్ రిజిస్ట్రార్, రాజోలు సబ్ డివిజన్, పొన్నమండ గ్రామ పంచాయితీ ప్రాంతం, పొన్నమండ, ఇంటి పన్నురశీదు ప్రకారం 3-125 ఆర్.ఎస్.నం.592/1 - ఎసి, 0-86 సెంట్లు -ఎసి0-03 ఎం సెంట్లు = 169-4 చదరపు గజాలు = 142-296 చదరపు మీటర్ల ఖాళీ స్థలం మరియు ఆర్‌సిసి భవనం. అందులో లావటరీ, బాత్‌రూమ్, డోర్ నం.3-106, ఆంధ్రప్రదేశ్-533248. హద్దులు: ఉత్తరం- మెయిన్ రోడ్డు, దక్షిణం - వడ్డి వెంకన్న స్థలం, తూర్పు - వడ్డి కోటేశ్వరరావు స్థలం, పడమర- వడ్డి వెంకన్న స్థలం.

నోటీసు సర్వీసుకు ప్రత్యామ్నాయంగా ఈ చర్యలు తీసుకోబడును. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తం బకాయిలు చెల్లించవలెనని పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎక్కడైనా వర్తించే చోట)కు సూచించడమైనది. విఫలమైన పక్షంలో ఈ నోటీసు తేదీ నుంచి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. దయచేసి పేర్కొన్న నోటీసు సెక్షన్ 13(13) ప్రకారం రుణగ్రహీతలకు/గ్యారంటీదారులకు/ తనఖా పెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/ బదిలీ చేయరాదని తెలియజేసిందని తెలియజేయండి. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం పైన పేర్కొన్న తనఖాపెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని రుణగ్రహీతలకు/ హామీదారులకు/తనఖాదారులకు తెలియజేసినట్లు కూడా దయచేసి పేర్కొన్న నోటీసును భావించవలెను.

తేదీ: 21.03.2025
ప్రదేశము: తూర్పుగోదావరి

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన లిమిటెడ్

కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : ఖాతాదారుల తోడ్పాటు, ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంస్థ వందేళ్లకు పైగా సమర్థ వంతమైన సేవలు అందించగలుగుతోందని కేసిబిఎస్ చైర్మన్ కోసూరి శ్రీని వాస సత్యనారా యణమూర్తి పేర్కొన్నారు. స్థానిక సినిమా రోడ్‌లోని కెవికె రావు ఆడిటోరియ ంలో గురువారం కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అధ్య క్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం అతిథు లను వేదికపైకి ఆహ్వానించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతి పాదనను సభ ముందు ఉంచారు. ఆడిటర్ సభ్యుల ఆదాయపు పన్ను సందే హా లను నివృత్తి చేశారు. సంస్థ అధ్యక్షులు కోసూరి మాట్లాడుతూ ఖాతాదా రులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. కేసిబిఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ కేసిబిఎస్ సమావేశంలో కేసీబీఎస్ ప్రధాన కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రానికి అగ్రికల్చర్ జేడీ సందర్శన

విశాలాంధ్ర-తాళ్లరేవు : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి మల్లవరంలో రైతులు ధూళిపూడి వెంకటరమణ (బాబి), దడాల సత్తికొండ అధ్వ ర్యంలో కృషి అమృత్ గోవు ఆధారిత వ్యవసాయ క్షేత్రంలో నాటు విత్తనాలు ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో వేసిన "రక్తశాలి" కుజిపటాలియా, ఆర్‌యన్‌ఆర్ పంట చేనును అగ్రికల్చర్ జేడీ విజయకుమార్ సందర్శించారు, తొలకరిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన "ధాయ్ బ్లాక్ ధాన్యం" ఆడించిన బియ్యం అందించిన ధూళిపూడి, ఈ సందర్భంగా రైతు బాబి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంను ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందజేయాలని, యన్‌ఆర్జియస్ వ్యవసాయంకు అనుసంధానం చెయ్యాలని, ప్రభుత్వ పరంగా గుర్తింపు పత్రాలు అందజేయాలని కోరారు. ఆయన వెంట ఏడి కే బాబూరావు, వ్యవసాయ సిబ్బంది అజయ్, సుధ గ్రామస్తులు సర్పంచ్ పంపన రామకృష్ణ, వుంగరాల వెంకటేశ్వరరావు, విళ్ళ సత్యనారాయణ, ధూళిపూడి సుభ, కాశీరాజు, దడాల ప్రసాద్, గంజా కాశీ, వెంటపల్లి పురు షోత్తం, నేతల నాగార్జున, రాయుడు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌ను నేటి బాలలు ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్‌ను నేటి బాలలు ఆదర్శంగా తీసుకో వాలని స్థానిక చైర్పర్సన్ అల మండ సత్యవతి అన్నారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో సునీత విలియమ్స్ బృందం అంతరిక్షం నుండి భూమికి సురక్షితంగా తిరిగి రావడం పై పలువురు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు అందించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు సఖిరెడ్డి విజయబాబు మాట్లాడుతూ సునీత విలియమ్స్ అంతరిక్షంపై తన ఆరో సంవత్సరంలోనే ఆపేక్ష పెంచుకున్నారని దీనికి కారణం చంద్రుడు పై మొట్టమొదటిగా కాలు మోపిన నలి ఆర్మ స్ట్రాంగ్‌ను ఆదర్శంగా తీసుకొని అంతరిక్ష పరిశోధనల వరకు ఎదిగి నేటి విజయాలను సాధించారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారి బూసరి అబ్బాయి, అలమండ దుర్గాప్రసాద్, బూడి సూరిబాబు, బూర్ల సత్తిబాబు, పైల శ్రీధర్, కడెంశెట్టి వాసు, బీసీ నాయకుడు వైభోగుల సుబ్బారావు, కట్ట వెంకటేశ్వ రరావు, గొల్లపల్లి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్ గణపతి, ఉపాధ్యాయులు సుమలత, ఎస్‌కె రేష్మ, శాంతి సుభాషిణి, గంగమ్మ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘం - అమలాపురం

ఆర్.ఓ.సి.నెం.758/2020-ఇ1. తేది. 20.03.2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో **15వ** ఆర్థిక సంఘ నిధులతో పద్దెనిమిది **(18)** పనులకు **రూ.101.50** మరియు ఎం.పి. ల్యాడ్స్ నిధుల నుండి ఒక **(1)** పనికి **రూ. 15.00** లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండరు పిలువబడినది.

టెండరు షెడ్యూల్ డౌన్ లోడింగ్ పందొమ్మిది **(19)** పనులకు

ప్రారంభ తేది. 20-03-2025. సా.7.00ల నుండి,

ముగింపు తేది.25.03,2025 సా.4.00ల వరకు

మిగిలిన వివరములు **www.tender.apeprocurement.gov.in** వెబ్‌సైట్ నందు చూడగలరు.

కమీషనరు

అమలాపురం పురపాలక సంఘం

ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - కడియం : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తుత ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారంగా ఉద్యో గులకు ఐఆర్ ప్రకటించి, వెంటనే పిఆర్సి వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తూర్పు గోదా వరి జిల్లా ఉపాధ్యక్షుడు పి రవి కుమార్ అన్నారు. గత ఐదు సంవత్సరముల నుండి ఉద్యోగులకు చెల్లించవలసిన జిపిఎఫ్, ఏపీజి ఎల్ఐ బకాయిలను చెల్లించాలని, ఇవి ప్రధానంగా ఉద్యోగి సేవింగ్స్‌కు సంబం ధించినవి కాబట్టి వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెండింగ్ డిఏలు సరెండర్ లీవ్ బకాయిలు, చెల్లించాలన్నారు. గత ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ ఉద్యోగులు గాని, ఉద్యోగ సంఘ నాయకులు గాని అడిగే హక్కును పూర్తిగా కోల్పోయారని, అడిగితే అక్రమ కేసులు లేక షోకాజు నోటీసులు బహుమానంగా ఇచ్చేవారని ఆవేదన వ్యక్తంచేశారు. వైద్య ఆరోగ్యశాఖలో మెడికల్ విభాగములో పనిచేయుచున్న సిబ్బందికి గత ఐదు సంవత్సరముల నుండి యూనిఫారం అలవెన్స్ గాని, యూనిఫారం గానీ ఇవ్వలేదని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

యువజంటకు డొక్కా సీతమ్మ ఉత్తమ సేవా పురస్కారం

విశాలాంధ్ర-ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామా నికి చెందిన ఇంద్రజాలికుల ఫిజియోథెరపిస్టు మోహిత్ సీతలు వారి కల్యాణానికి ముందు 100 రోజుల సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను డొక్కా సీతమ్మ సేవా సమితి వారు డొక్కా సీతమ్మ ఉత్తమ సేవ పురస్కారంతో స్థానిక మ్యాజిక్ హౌస్‌లో అవార్డుతో ఘనంగా సత్కరిం చారు. సంస్థ వ్యవస్థాపకురాలు పిల్లా నాగ శ్రీదేవి, జంటను అభినందించారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం

సీపీఐ నాయకుల ప్రతిజ్ఞ

విశాలాంధ్ర - రాజోలు : పేదప్రజల అభివృద్ధికి ప్రాణ త్యాగాలను చేసిన అమరవీరులు కంది కట్ల నాగభూషణం, అల్లూరి బుచ్చిరామ రాజు, రాపాక సూర్యనారాయణ, గుత్తుం వెంకటరెడ్డి, దొంగ నరసింహామూర్తి, గుబ్బల వెంకటరెడ్డి లాంటి మృత వీరుల త్యాగాలను స్మరించుకుంటూ మలికిపురం భూపాతివారిపేటలో అమరవీరుల స్మారక స్తూపం వద్ద సీపీఐ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. పేద, పీడిత తాడిత, బడుగు బలహీనవర్గాల సమస్యలకోసం నిరంతరం పోరాడిన అమరుల ఆశయాలను కొనసాగించాలని ఈ సభలో మాట్లాడిన వక్తలు అన్నారు. ప్రస్తుతం భారత దేశ ప్రజలు అభద్రతా భావంలో వున్నారని, పాల కులు కుల మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఇలాంటి వాటికి ప్రజలు దూరంగా వుండి శాంతి, సామర స్యాలను కాపాడాలన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగి పోతుందని, కొత్తపరిశ్ర మలను స్థాపించి యువతను ఆదుకోవాలని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధానాలను విడనాడాలని అన్నారు. సిపిఐ నాయకులు చెల్లుబోయిన కేశవశెట్టి, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ప్రభాకరరావు, నల్లి బుజ్జిబాబు, దేవ సురేషబాబు, దీపాటి గంగాచలం, పుల్లెల ఆనంద్, ఆకన నాగేశ్వరరావు, దొండపాటి చిట్టి రాజు, బత్తుల రవిప్రసాద్, డి భానోజీ, పెయ్యల పండు, రవి పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయాల పోస్టుల దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-కొవ్వూరు: కొవ్వూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు లోని కొవ్వూరు, చాగల్లు మండ లాల పరిధిలో అంగన్వాడి ఆయా పోస్టుల దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని సీడీపీఓడీ మమ్మీ తెలిపారు. అర్హులైన మహిళలు కనీసం 10వ తరగతి ఉత్తరులై ఉండవలెనని స్థానికు లైన వివాహిత మహిళలకు మాత్రమే అర్హులని తెలిపారు దరఖాస్తు చేసుకునేవారు కుల ధ్రువీకరణ పత్రము నివాస ధ్రువీకరణ పత్రము పదవ తరగతి మార్కు లిస్ట్ పుట్టిన తేదీ తగు పత్రములను అటా స్టేషన్ చేయించుకుని ఆ యొక్క దరఖాస్తును ఫిష్ అభివృద్ధి పథక అధికారికి లేదా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయం నందు నమోదు చేసుకోవాలని తెలిపారు అంగన్వాడి ఖాళీ పోస్టులు గౌరీపల్లెలో (1), ఆరికరేవుల (2), దారవరం (2), కుమారదేవం (3) పోస్టులు ఖాళీగా ఉన్నావని తెలిపారు మరింత పూర్తి సమాచారం కోసం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సంప్రదించమని డి మమ్మీ తెలిపారు.

రాజోలు చేరుకున్న సిఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్ సైకిల్ ర్యాలీ

విశాలాంధ్ర-రాజోలు : కేంద్ర పారిశ్రా మిక భద్రతాదళం (సిఐఎస్‌ఎఫ్) వ్యవ స్థాపక వేడుకల్లో భాగంగా పశ్చిమ బెంగాల్ నుండి కన్యా కుమారి వరకూ సిఐఎస్‌ఎఫ్ దళాలు చేపట్టిన సైక్లోదాన్ సైకిల్ యాత్ర గురువారం రాజోలు చేరు కుంది. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ డాక్టర్ పి సాయిబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. దళ డిప్యూటీ కమాండర్ వికె ప్రభాకర్ మాట్లాడుతూ సురక్షిత తీరాల, సంపన్న భారతదేశం అనే నినాదంతో ఈ జైత్రయాత్ర కొనసాగుతుందన్నారు. పశ్చిమ బెంగాల్ నుండి కన్యాకుమారి వరకూ సాగుతున్న ఈ సైకిల్ యాత్రలో 50 మంది సభ్యులు ఉన్నారని, వీరిలో 8 మహిళాలు కూడా ఉన్నారన్నారు. జాతీయ భద్రతాపై ప్రజల్లో అవగాహనకల్పించడం,మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలు, అక్రమ రవాణా వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు తెలిపారు. అసిస్టెంట్ కమాండర్ సప్తపది, డిగ్రీ కళాశాల పిఆర్‌ఓ నల్లిరాజు, ఎన్ ఎస్‌ఎస్ పీఓలు కృష్ణ మూర్తి, పిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి మదుకుమార్ పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ గురు సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సభలను జయప్రదం చేయండి

-పీడీఎస్‌యు -పివైఎల్ ప్రజా సంఘాలు

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నాగమల్లి సెంటర్ వద్ద రాజరాజేశ్వరి ఐటిఐలో జాతీయ కార్యవర్గం పిలుపు లో భాగంగా కామ్రేడ్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సభ పోస్టర్లు గురువారం ఆవిష్కరించడం జరిగింది. దీనిలో ముందుగా ౹ణూఖ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్దు మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధులు, యువతకు స్ఫూర్తి ప్రదాతలు అయిన భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సభలు, సదస్సులు, కాగడాల ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు, వినుత్న కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలిపారు. మార్చి 23న దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులో నూనూగిమీసాల వీరులు పొగ బాంబులతో బ్రిటిష్ వారిని భయపెట్టిన ధీరులు, ఉరికొయ్యను ముద్దా డిన వీరులు అయిన భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా మార్చి 23 నుండి 30 వరకు జిల్లాలో పలు చోట్ల వారి ఆశయాల సాధనకు కృషి చేస్తామని, సభలు, ర్యాలీలు వంటివి నిర్వహిస్తున్నా మని యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. మఠ్రి మూర్తి, టీ తరుణ్, వినయ్, ప్రశాంత్, మణికంఠ, భూపతి, సత్య దేవ్ తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తి సంఘాలతో ఆదరణ పథకం సమావేశం

విశాలాంధ్ర - సీతానగరం: కుల వృత్తి సంఘాలతో ఆదరణ పథకం 3 సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ ఎమ్ భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ భారతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆదరణ-3 పథకం ప్రవేశట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనిలో భాగంగా మండల కుల వృత్తి సంఘాలతో వృత్తి దారులకు ఆధునిక పనిముట్లు నాణ్యమైన కంపె నీలు, ఏజన్సీల ద్వారా అందించుటకు సమావేశం నిర్వహించడం జరిగింద న్నారు. ఈ సమావేశం ద్వారా ఆయా వృత్తి దారులకు ఏ పనిముట్లు అవస రమో తెలుసుకొని సమాచారం సేకరించడం జరిగింది అని అన్నారు. ఈ సమాచారం పై అధికారులు పంపించి ఆదరణ 3లో వృత్తిదారులకు అవస రమైన పనిముట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ సుబ్రమణ్యం, జూనియర్ అసిటెంట్ సుమతి, వెనకబడిన తరగతుల కుల వృత్తి సంఘ నాయకులు, కుల వృత్తిదారులు పాల్గొన్నారు.

ఐక్యూ సీజీఓ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర/కాకినాడ: యువ గేమర్లకు ఇది గోల్డన్ చాన్స్ అని చెప్పవచ్చు. హై-పర్ఫా ర్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ 2025 సంవత్సరానికి తన చీఫ్ గేమింగ్ ఆఫీసర్ (సీజీఓ) కోసం దరఖాస్తులను ఆహ్వానిం చింది. ఈ సందర్భంగా ఐక్యూ సీఈఓ నిపున్ మర్యా మాట్లాడుతూ యువ గేమర్లకు ఇది గొప్ప అవకాశం అన్నారు. ఈ అవకా శం పొందాలంటే గేమింగ్ పై అభిరుచి, 25 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈ చీఫ్ గేమింగ్ ఆఫీసర్ బాధ్యతలలో ప్రధానంగా ఐక్యూ కొత్త స్మార్ట్‌ఫోన్ల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం, బ్రాండ్ ఈస్పోర్ట్ వ్యూహాన్ని నడిపి ంచడం, భారతదేశంలోని టాప్ ఈస్పోర్ట్స్ గేమర్లతో చురుకుగా వ్యవహరించడం ఉన్నా యన్నారు. ఈ రోల్ ద్వారా సీజీఓ ఐక్యూ తాజా ఉత్పత్తులకు యాక్సెస్ పొందే అవకా శం ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రముఖ గేమింగ్ ఈవెంట్లలో బ్రాండ్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. ఐక్యూ తన సీజీఓకి రూ.10 లక్షలు అందిస్తుందని పేర్కొన్నారు. యువ గేమింగ్ అభిమాన్‌లు ఐక్యూ అధికా రిక వెబ్‌సైట్ ఐక్యూ.కామ్ ద్వారా మార్చి 30, 2025 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

– సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు
ఇళ్ల స్థలాల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర -భీమవరం: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని, టిడ్కో గృహాలు లబ్దిదారులకు అందించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్య దర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ శుక్ర వారం భీమవరం రూరల్ తాడేరు గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్లు లేని నిరుపేదలతో ఇళ్ల స్థలాలకై ధరఖాస్తులు పూర్తి చేయించారు. భీమ రావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలపై ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు పట్ట ణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలా లిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించి పేదల సొంత ఇంటికల నెరవేర్చాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేవరకు సీపీఐ పోరాడుతుందని ఇళ్ల దరఖాస్తులను ఏప్రియల్ 2న కలెక్టర్‌కు అంద చేస్తామన్నారు. జగనన్న నివేశనా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేని లబ్ధిదారులకు కూడా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని భీమారావు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచి నదని తాత్సార్యం చేయకుండా త్వరిత గతిన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్,ప్రజానాట్య మండలి నాయ కులు ఖాన్ భాష, నడపాస్వరాజ్యలక్ష్మి, దేవి, కృష్ణవేణి, పెచ్చెటి అనంతలక్ష్మి, మిండాలు వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు

–జిల్లా కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ఈవీఎం, వీవీపాట్స్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్ద నున్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రెవిన్యూ, ఎన్నికలు అగ్ని మాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం గోదాము భద్రతకు చేప డుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ అధికా రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకట రావు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఎస్ రాజేశ్‌బీ కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం రాజకీయ పార్టీల ప్రతినిధులు జి సాయిబాబా (టీడీపీ), ఎస్ అప్పారావు (బీఎస్పీ), బి జయప్రకాష్ (కాంగ్రెస్), కె కృష్ణ మోహన్(ఆప్), ఆర్ వెంకటేశ్వరరావు (వైఎస్సార్‌సీపీ), సీహెచ్ రమేష్ బాబు(భాజపా), టి ఈశ్వరరావు (సీపీఎం), ఎ సత్యనారాయణ (జనసేన) ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తితే
సంబంధిత అధికారులపై చర్యలు

– అధికారులకు జిల్లా కలెక్టర్
కె. వెట్రిసెల్వి ఆదేశం..

విశాలాంధ్ర- ఏలూరు: రానున్న వేసవిలో జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడైనా తాగు నీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం వేసవిలో త్రాగునీటి సరఫరా,జల్ జీవన్ మిషన్ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పురోగతిలో ఉన్న 325 పనులతో పాటు, ఇంకా ప్రారంభించని 108 పనులను కూడా దశలవారీగా చేపట్టి జూన్ నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు.జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందించే కార్యక్రమంలో భాగంగా మొత్తం 4 లక్షల 74 వేల 978 గృహాలకు,4 లక్షల 6 వేల 14 గృహాలకు కుళాయి కనెక్షన్ అందించడం జరిగిందని, మిగిలిన గృహాలకు కూడా నిర్దేశించిన సమయంలోగా కుళాయి కనెక్షన్లు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ కె.భీమేశ్వరరావు, ఐటిడిఏ కె. రాములు నాయక్,ఆర్ డబ్ల్యు ఎస్, ఇరిగేషన్ ఎస్‌ఈ లు జి. త్రినాథ బాబు, పి.నాగార్జునరావు, డిపిఓ అనురాధ,ఐ.సి డి.ఎస్.పీడీ శారద, డిఎం హెచ్ఓ డా. మాలిని, డ్వామా పీడీ కే.వి.సుబ్బారావు, భూగర్భ జలశాఖ డిడి పి.ఎస్.విజయ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

– ఐసీడీఎస్ సీడీపీఓ టీ.నాగమణి

విశాలాంధ్ర - రాజానగరం : తమ ప్రాజెక్టు పరిధిలోని రాజానగరం, రాజ మహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో ఖాళీ ఏర్పడిన ఆరు అంగ న్వాడీ సహాయ కురాలు(ఆయా)పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు ఐసీడీఎస్ సీడీపీఓ టీ.నాగమణి అన్నారు.ఇందుకు సంబంధించి విశాలాంధ్రతో గురువారం చరవాణిలో ఆమె మాట్లాడుతూ రాజానగరం మండలం పాలచర్ల-1 కేంద్రంలో ఒక పోస్టు (ఎస్సి విభాగం), పాతతుంగపాడు-2 లో ఒక పోస్టు(ఓపెన్ కేటగిరీ) ఉన్నాయన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం -16లో ఒకటి (బీసీఈ),పిడింగొయ్యి-3 లో ఒకటి(ఓపెన్ కేటగిరి), కడియం మండలంలో కడియం-5 లో ఒకటి(బీసీ-బి) వేమగిరి-4లో ఒక పోస్టు(బీసీ-ఏ) ఖాళీలు ఉన్నాయ న్నారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఇందుకు సంబంధించిన దరఖాస్తు లు రాజానగరంలోని తమ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ నుంచి అందు బాటులో ఉంటాయన్నారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై, 2024 జూలై 1 నాటికి 21 నిండి 35 సంవత్సరాలు వయసు కలిగి, స్థానికులై ఉండాల న్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలని సీడీపీవో నాగమణి తెలిపారు.

భారత దేశ భవిష్యత్తు బాగుండాలంటే
యువత ఆలోచనల్లో మార్పు రావాలి

– సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీ నారాయణ...
– శ్రీవాసవిలో ప్రారంభమైన మూడు రోజుల సాంకేతికోత్సవం టెక్ యుఫోరియా 2025

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల పాటు జరుగనున్న సాంకేతికోత్సవం టెక్ యుఫోరియా 2కె25 గురువారం అట్టహాసంగా ప్రారంభించబడింది.కళాశాలలో గురువారం జరిగిన సాంకేతికోత్సవ ప్రారంభ వేదుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీ నారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని, దానికనుగుణంగా వారి ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఒక పదమూడేళ్ళ కుర్రాడు టెక్నాలజీని వాడి హార్ట్ ఎటాక్ ను పసిగట్టగలిగే యాప్‌ను తయారు చేసిన విధంగా ఆలోచన చేస్తే, మరొక ఘటనలో ఇంకొందరు టెక్నాలజీని చెడు మార్గంలో ఉపయోగించి, ఒక అమ్మాయి జీవితాన్ని పాడు చేసి జైలు పాలు అయ్యారని అందుకే టెక్నాలజీని మీరు ఎలా నేర్చుకున్నారు అన్నదాని కంటే దానిని ఎలా ఉపయోగించారన్నదే ముఖ్యమని తెలుసుకోవాలన్నారు. సాంకేతిక ఉత్సవానికి సంబంధించి ఒక లఘు చిత్రాన్ని, పోస్టర్ లను ఆయన చేతుల మీదుగా విడుదల చేసారు. కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరరాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ కోశాధికారి బాల కాశయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వర రావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, వివిధ విభాగాల అధిపతులు, వివిధ కళాశాలల నుండి విచ్చేసిన విద్యార్ధినీ విద్యార్థులు పాల్గొన్నారు.

22 న ఆర్ట్స్ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ: ఈనెల 22 వ తేదిన రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో సంకల్ప జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధికల్పించుటకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంకల్ప మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.

చర్చ జరపకుండా ఎస్సీ వర్గీకరణ
బిల్లు ఆమోదించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

విశాలాంధ్ర - రాజోలు : రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ జరపకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడం ప్రజాస్వా మ్యానికి గొడ్డలిపెట్టు అని దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీ కృష్ణ అన్నారు. రాజోలు పట్టణంలో గురువారం బత్తుల మురళీకృష్ణ మాట్లా డుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయ్యడానికి చూపెట్టిన అత్యుత్సాహం సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఎందుకు చూపెట్టడంలేదో ప్రజలందరూ గ్రహించాలన్నారు. ఈ రాష్ట్రంలో దళితులను విభజించి మాల సామాజిక వర్గాన్ని అణగద్రొక్కడమే లక్ష్యంగా అన్నీ రాజకీయ పార్టీలు కుట్ర పన్నడం దురదృష్టకరమైన విషయమని బత్తుల మురళీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు దశల వారిగా రిజర్వేషన్లు తొలగించే ప్రయత్నంలో భాగంగానే ఎస్సీ వర్గీకరణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెత్తిన పెట్టుకుని తెరపైకి తెచ్చాయని బత్తుల మురళీ కృష్ణ తెలియచేసారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 2011వ సంవత్సర జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని ఎస్సీ వర్గీకరణ చెయ్యడం దుర్మార్గమని, తాజాగా కుల గణన చేపట్టి ఎస్సీ సామాజిక వర్గంలో ఏ ఉపకులం జనాభా ఎంతుందో తేల్చిచెప్పాలని బత్తుల మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షనే ధ్యేయంగా దళిత చైతన్య వేదిక పని చేస్తుందని బత్తుల మురళీకృష్ణ తెలిపారు.

ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : పిల్ల లను తీసుకువెళ్ళే వాహనాలకు ప్రమాదాలు జరిగితే యాజమాన్యాలే భాధ్యత వహిం చాల్సి ఉంటుందని తహశీల్దార్ జెవిఆర్ రమేష్ సూచించారు. స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయం వద్ద మండలంలోని 26 ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఎమ్ఈఓ స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ పిల్లల వాహనాలను జాగ్రత్తగా నడిపే డ్రైవర్లను పెట్టుకోవాలన్నారు. ఎమ్ఈఓ మాట్లాడుతూ స్కూల్ వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్లు ఉండాలని, డ్రైవర్‌కు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. పిల్లలను స్కూల్‌కు తీసుకుని వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు వాహనాలను నెమ్మదిగా నడపాలని డ్రైవర్లకు సూచించాలన్నారు. ఎమ్ఈఓ.2 ఎ సుబ్రహ్మణ్యేశ్వరరావు, స్వామి వివేకానంద విద్యా సంస్థల కరస్పాండెంట్ ఒమ్మి రఘురామ్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట భాస్కర్ కాలనీ ఇమ్మానుయేల్ చర్చిలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు జరిపారు. వారిలో 23 మందిని ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. బ్లెస్సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పిఠాపురం సిఎంసి సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన శిబిరంలో 200 మంది ప్రజలు పాల్గొనగా వారికి వైద్య పరీక్షలు జరిపి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. 28 మందిని కళ్ళజోళ్లకు ఎంపిక చేశారు. అలాగే 23 మందిని ఉచిత ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న ప్రజలకు, వైద్య సిబ్బందికి బ్లెస్సింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్, డా టి బ్లెస్సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ శిబిరంలో సిఎంసి నేత్ర వైద్యులు డా అమృత లాల్, సిబ్బంది, ఫౌండేషన్ ఉపాధ్యక్షులు టి మోసెస్ అభిషేక్, కార్యదర్శి టి సూర్యకుమారి, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు షెర్లీ క్రిస్టియనా, పి ఆనంద్ బాబు, జె జయరాజ్, పురుషోత్తం దాస్ లంక, వి జాన్, ఎంఎ జేమ్స్, చందు స్టీఫెన్ పాల్గొని సేవలనందించారు.